క్లుప్తంగా

రైతు ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులకు శిక్షణ

నందిగాం: స్థానిక మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం లీడర్లకు సంఘ నిర్వహణపై ఒక రోజు శిక్షణను వెలుగు ఏపీఎం మనోరత్నం పర్యవేక్షణలో సోమవారం ఇచ్చారు. ప్రతి సంఘం క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, సమావేశ అంశాలను రికార్డుల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. సంఘాల బలోపేతం, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. శిక్షణలో మర్లపాడు, లఖిదాసుపురం, చిన్ని తామరాపల్లి, రథజనబ్దొపాడు, కాపుతెంబూరు తదితర గ్రామాల నుంచి 52 మంది లీడర్లతో పాటు ఎంఎస్ అధ్యక్షురాలు అరుణ, సీసీలు హైమ, పద్మ, సరోజిని, రజిని పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా వివరాలకు వినతి

వజ్రపుకొత్తూరు: మండలంలో మత్స్యకార భరోసా కింద గత ప్రభుత్వం ఎంత మందికి వేట నిషేధభృతిని అందించారో వాటి వివరాలు అందించాలని మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం వజ్రపుకొత్తూరులో నిర్వహించిన మీకోసంలో తహసీల్దార్ సీతారామయ్యకు వినతిని అందజేశారు. మత్స్యకార పింఛన్ల వివరాలు కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తిన మోహనరావు, మాజీ అధ్యక్షులు బి.శశి భూషణరావు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా


మేనేజర్ అప్పలస్వామికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇచ్ఛాపురం: తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. పట్టణ విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని, వాహన మరమతులు చేపట్టాలని, కార్మికులకు వర్తించే చట్టబద్ధమైన సెలవులను అమలు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ అప్పలస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రమేష్‌పట్నాయక్, శంకర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం


స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీమోహనరావు

కవిటి: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న కూరగాయల వినియోగంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని తహసీల్దార్ బి.మురళీ మోహనరావు అన్నారు. కవిటి మండల గ్రీవెన్స్ విభాగం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. పలువురు స్టాల్‌ను సందర్శించి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి తులసయ్య, ఈఓపీఆర్డీ శివాజీపాణిగ్రాహి, ఏపీఎం కె.గోవింద్ పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్ ప్రారంభం


అర్బన్ మార్కెట్ ప్రారంభిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘానికి చెందిన మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో అర్బన్ మార్కెట్‌ను కాశీబుగ్గ సంత మైదానంలో సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, టీఎల్ఎఫ్ అధ్యక్షులు టి.రాజ్యలక్ష్మి, కార్యదర్శి సునీత రాణి, ఉపాధ్యాక్షురాలు జగదాంబ, సీఎంఎం మోహన్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 65 మంది ఎంపిక


జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో మినీ జాబ్ మేళాను సోమవారం నిర్వహించారు. రెండు ప్రైవేట్ సంస్థల నుంచి ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేశారు. మేళాకు 182 మంది హాజరవ్వగా వీరిలో 65 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జవహర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వంశీ కృష్ణ, కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ రవికుమార్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు, తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు బీమా భారం!



- ఉచిత బీమా పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు
- రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ సర్కార్
- రబీ నుంచి నోటిఫైడ్ పంటలు పండించే రైతులపై అదనపు భారం

టెక్కలి:

రైతులకు రబీ సీజన్ నుంచి కూటమి ప్రభుత్వం భారీగా షాక్ ఇవ్వనుంది. వ్యవసాయంతో పాటు ఇతర పంటలు పండిస్తున్న రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరకు ఎంతో అండగా నిలిచిన వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచింది. ఇకపై తుఫాన్ ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో బీమా అందాలంటే నోటిఫైడ్ చేసిన పంటలకు సంబంధించి బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాలని ప్రకటన చేసింది. దీంతో అన్నదాతలపై అదనపు భారం పడే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రైతులు మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచిత బీమా అమలు



ఏటా ప్రకృతి విపత్తుల నుంచి రైతులు నష్టపోతు న్నారు. కొన్ని సందర్భాల్లో బీమా చెల్లించుకోకపోవడంతో తుఫాన్ సమయంలో నష్ట పరిహారం అందుకోలేక పోయేవారు. అటువంటి పరిస్థితులు లేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల కోసం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ-క్రాప్ విధానంతో ప్రతీ రైతు వివరాలను నమోదు చేసి వారికి ఉచితంగా పంటల బీమాను వర్తింపజేశారు. వాస్తవానికి వరికి 600 రూపాయలు, ఉద్యానవన పంటలైన జీడి, మామిడికి సుమారు రూ. నాలుగు వేలు బీమా ప్రీమియం చెల్లించాలి. ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేది. దీంతో రైతులకు ఎటువంటి బెంగ లేకుండా బీమా విషయంలో ధీమాగా ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

నియోజకవర్గంలో రూ. 21 కోట్ల చెల్లింపులు

వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంలో భాగంగా టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో ఒక్క వ్యవసాయానికి సంబంధించి సుమారు 61 వేల మంది రైతులకు ఉచితంగా బీమా నమోదు చేశారు. అందులో నష్టపోయిన సుమారు 13,639 మంది రైతులకు 21 కోట్ల రూపాయలు చెల్లింపులు చేశారు. ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రీమియం భారం రైతులపై పడింది. అంతే కాకుండా ఈ రబీ సీజన్‌లో రైతులంతా వరికి సంబంధించి డిసెంబర్ 31వ తేదీలోగా ఎన్‌రోల్ చేసుకోవాలి. జీడి, మామిడికి నవంబర్ 15, టమాటకు డిసెంబర్ 15వ తేదీ వరకు గడువు ఇచ్చారు. రబీ సీజన్ నుంచి ఉద్యానవన పంటలకు సంబంధించి ఐదు శాతం, వరి, ఇతర నోటిఫైడ్ పంటలకు 1.6 శాతం బీమా ప్రీమియం చెల్లింపులు చేయాలి. వచ్చే ఖరీఫ్ సమయానికి ప్రీమియం చెల్లింపులు పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతులకు అండగా అమలు చేసిన వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేసే నిర్ణయాన్ని తక్షణమే కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. ఈ పథకం వలన రైతులకు ఎటువంటి బెంగ లేకుండా బీమా నమోదు జరిగేది. ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతులకు భారం కానున్న ఇటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

–హెచ్.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ప్రతినిధి, టెక్కలి

చంద్రబాబు పాలనలో ఇబ్బందులే..



చంద్రబాబు అధికారంలోకి వస్తే రైతులకు వచ్చే ఇబ్బందులు కొత్త కాదు. గతంలో రైతులకు ఎన్నో ఇబ్బందులకు గురి చేసేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉండేది. ఇప్పుడు మరలా కష్టాలు మొదలవుతున్నాయి. నిన్నటి వరకు సరిగ్గా విత్తనాలు, ఎరువులు అందలేదు. ఇప్పుడు ఉచిత పంటల నమోదుకు మంగళం పాడేస్తున్నారు.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి

ఉచిత పంటల బీమా కొనసాగించాలి



వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు ఎంతో ఉపయోగకరమైన ఉచిత పంటల బీమాను కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. రబీ సీజన్ నుంచి రైతులే బీమా చెల్లించుకోవాలని తాజాగా ప్రకటించారు. దీనివలన ఎంతో మంది రైతులు నష్టపోతారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి.

–బి.ప్రభాకరరావు, రైతు, దిమిలాడ, నందిగాం మండలం.

ఇబ్బంది పెట్టడం తగదు



అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రైతులకు మంచి చేయాలి. అంతే తప్పా రైతులకు అనుకూలంగా ఉన్న పథకాలను నిలిపి వేయడం మంచి పద్ధతి కాదు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం వలన ఎంతో మంది రైతులకు మేలు జరిగింది. రుణాలు తీసుకున్న తీసుకోకపోయిన ఈ-క్రాప్‌తో ఉచితంగా బీమా నమోదు జరిగేది. కూటమి సర్కార్ రైతులు ఇబ్బంది పెట్టడం తగదు.

–కె.సూర్యప్రకాశ్, రైతు, నందిగాం

రోడ్లపై పశువులను వదిలేస్తే రూ. వెయ్యి జరిమానా


పశువులను గోశాలకు తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

టెక్కలి: రోడ్లపై ఇష్టానుసారంగా పశువులను వదిలిస్తే ఆయా యజమానులకు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని టెక్కలి మేజర్ పంచాయతీ ఈవో కె.వి.వి.జగన్నాథం తెలిపారు. సోమవారం పట్టణంలోని రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను పంచాయతీ సిబ్బంది పట్టుకొని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వెనుక గల గోశాల కేంద్రానికి తరలించినట్టు చెప్పారు. పంచాయతీ పరిధిలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను గుర్తించి గోశాలకు తరలించనున్నట్టు స్పష్టం చేశారు. ఇప్పటికే ఏడు పశువులను తరలించినట్లు పేర్కొన్నారు. ఇందులో రెండు పశువులకు సంబంధించి ఆయా యజమానులకు జరిమానా విధించి పశువులను అప్పగించామన్నారు. మూడు రోజులు దాటితే స్థానిక గోశాలలో ఉన్న పశువులను ఇతర జిల్లాల్లోని గోశాలకు తరలిస్తామని ఈవో స్పష్టం చేశారు.

రబీ పంటల సాగుకు సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నర్సింహమూర్తి

సోంపేట: రబీ పంటల సాగుకు రైతులను సిద్ధం చేయాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి వ్యవసాయ సహాయకులకు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీలో ఆరుతడి పంటల విస్తీర్ణం, నూనె గింజల విస్తీర్ణం పెంచేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. రబీ పంటలకు కావలసిన ఎరువుల అవసరాలు గుర్తించాలన్నారు.

సెర్ప్ ఏపీఎం పోస్టు ఖాళీ!


ఏపీఎం లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో 1348 స్వయం సహాయక సంఘాల్లో 14,956 మంది సభ్యులు ఉన్నారు. వీవోఏల ద్వారా సంఘాలను బలోపేతం చేయాల్సిన సెర్ప్ ఏపీఎం పోస్టు నెల రోజులుగా ఖాళీగా ఉంది. దీంతో స్వయం సహాయక సంఘాల పనితీరును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏపీఎం సనపల ప్రసాదరావు బదిలీపై కంచిలి వెళ్లి పోవడంతో డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐదు మంది ఏపీఎంలను ఎంపిక చేసి ఇచ్ఛాపురం వెళ్లాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎవరికి వారు పైరవీలు చేసుకొని ఇక్కడ విధుల్లో చేరేందుకు విముఖత చూపుతున్నారని సిబ్బంది చెబుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఏపీఎంను నియమించాలని స్వయం సహాయక సంఘ సభ్యులు కోరుతున్నారు.

డిసెంబర్ 20 నుంచి సీపీఐ శతజయంతి ఉత్సవాలు

కాశీబుగ్గ: సీపీఐ శతజయంతి ఉత్సవాలను డిసెంబర్ 20 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ తెలిపారు. పలాసలోని సీపీఐ కార్యాలయంలో మండల సమితి సమావేశాన్ని సీహెచ్ రవి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శాఖలో పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి చాపర సుందరలాల్, జిల్లా సమితి సభ్యులు చాపర వేణుగోపాల్, మండల కార్యదర్శి ఎం.వెంకటరమణ, నాయకులు గోరు వాసు, సుందరరావు, మున్నా, పవన్, తిరుపతిరావు ఉన్నారు.

పశుగ్రాసానికి పాట్లు!


సేకరించిన పశుగ్రాసాన్ని తీసుకొస్తున్న మహిళా రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్: పాడిరైతులు పశుగ్రాస కొరతను ఎదుర్కొంటున్నారు. కొంత కాలంగా వరి గడ్డి కొరత రైతులను తీవ్రంగా వెంటాడుతోంది. దీంతో పశువుల పోషణ భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో దాణను కొనుగోలు చేసి పశువులకు మేత వేయడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో పొలం గట్లపై పెరిగే పచ్చగడ్డిపై ఆధారపడుతున్నారు. మహిళలు సైతం పశుగ్రాసం కోసం పంట పొలాల వైపు పరుగులు తీస్తున్నారు. పచ్చగడ్డిని కోసి దూర ప్రాంతాల నుంచి అతికష్టం మీద తీసుకొని వచ్చి పశువులకు పెడుతున్నారు.

నిర్వాసితుల వివరాలు నమోదు


వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు సంబంధించి భూములిచ్చిన నిర్వాసితుల పెండింగ్ అవార్డు వివరాల నమోదు ప్రక్రియను అధికారులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సంతబొమ్మాళి మండలం రెవెన్యూ అధికారుల సమక్షంలో మూలపేట, విష్ణుచక్రం తదితర గ్రామాలకు చెందిన పెండింగ్ అవార్డు నిర్వాసితుల వివరాలను సోమవారం నమోదు చేశారు. నిర్వాసితుల సమక్షంలో సుమారు 32 ఎకరాలకు సంబంధించి 62 మంది నిర్వాసితుల వివరాలను నమోదు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

చైన్ స్నాచర్ల హల్‌చల్!

- మహిళ మెడలో చైన్ తెంచివేత
- రోల్డ్‌గోల్డ్ అని తెలుసుకొని పడేసి పరారైన వైనం
- పోలీసులు కేసు నమోదు

కాశీబుగ్గ: చైన్‌స్నాచర్లు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో సోమవారం ఉదయం హల్‌చల్ చేశారు. ఓ మహిళపై దాడి చేసి మెడలోని తాడును తెంచుకుపోయారు. అయితే అది రోల్డ్‌గోల్డ్ కావడంతో పడేసి పరారయ్యారు. ఈ సంఘటన కేటీరోడ్డు ఎస్.ఎం.డి.పార్లర్ సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పలాస అన్నపూర్ణాశ్రమం వద్ద ఉన్న ఓ జీడి పరిశ్రమలో పనిచేస్తున్న సవర సబిత కాశీబుగ్గ బస్టాండ్ వద్ద కూరగాయలు కొనుగోలు చేసి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా.. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఆమె మెడలో ఉన్న చైన్‌ను తెంపేశారు. అయితే అది రోల్డుగోల్డుగా తెలుసుకొని అక్కడే పడేసి ఉడాయించారు. సబిత స్వగ్రామం మందస మండలం కుడుమసాయి.

ఉపాధి నిమిత్తం పలాసలో అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. సంఘటనపై కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టపగలు జరిగిన సంఘటనపై సీసీ ఫుటేజీ సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు.

గొర్రెలు, మేకలు చోరీ

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన బొమ్మాళి రామయ్యకు చెందిన 35 జీవాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుపోయారు. గ్రామ శివారులో ఉన్నటువంటి శాలలోని 15 మేకలు, 20 గొర్రెలను పట్టుకుపోయారు. శనివారం రాత్రి జరిగిన సంఘటన ఆదివారం ఉదయం తెలియడంతో రామయ్య, అతని భార్య సుమలత కన్నీరు మున్నీరయ్యారు. చోరీపై బాధితులు కాశీబుగ్గ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. అయితే కాశీబుగ్గ సీఐ మోహనరావు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాశీబుగ్గ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన పలాస మండలం గరుడఖండి గ్రామం పాతజాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రమణ అనే వ్యక్తి అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు.

తిలక్‌ను అడ్డుకున్న పోలీసులు


నందిగాం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో తెలుగుదేశం పార్టీ నాయకుల చేతిలో దాడికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించేందుకు వెళ్లకుండా వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌ను పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం ఇంటి నుంచి బయలుదేరి వస్తుండగా నందిగాం దగ్గరలో టెక్కలి సీఐ శ్రీనివాసరావు, నందిగాం ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ తమ సిబ్బందితో అడ్డుకొని కాశీబుగ్గ వెళ్లనీయలేదని తిలక్ తెలిపారు.

ఖాకీల గుప్పెట్లో కాశీబుగ్గ


బాధితులను పరామర్శించేందుకు వస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని, మాజీ మంత్రి సీదిరి

- ప్రజల్లో భయాందోళనలు
- పలాస-కాశీబుగ్గకు నలువైపులా పోలీసుల గస్తీ

పలాస, కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు పోలీసుల అష్ట దిగ్బంధంలో సోమవారం చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. జంట పట్టణాల్లో ఎక్కడ చూసినా పోలీసులే కనిపిస్తున్నారు. కాశీబుగ్గ పట్టణానికి రావాల్సిన ప్రధానమైన తాళభద్ర, చినబాడాం రైల్వే గేట్లు వద్ద పోలీసులు గుంపులు గుంపులుగా ఉండి తనిఖీలు చేస్తుండటంతో ఆ గేట్లు వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి జీఎంఆర కాలనీలో ఉన్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇంటి చుట్టూ పోలీసులు గస్తీ కాశారు.

బాధితులకు పరామర్శ


మాజీ స్పీకర్ తమ్మినేనికి జరిగిన సంఘటన వివరిస్తున్న అల్లు రమణ


మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇంటిముందు మోహరించిన ఆర్మ్‌డ్ ఫోర్స్

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో తెలుగుదేశం నాయకులు, రౌడీ మూకల దాడికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం పరామర్శించారు. కాశీబుగ్గ రోటరీనగర్‌లో ఉన్న మొదలవలస మన్మధ, అల్లు రమణలను కలిశారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయ, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, కౌన్సలర్‌లు, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు, నాయకులు ఉంగ సాయికృష్ణ, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, బత్తిని హేమేశ్వరరావు, మద్దు రాంప్రసాద్, అంబటి ఆనందరావు, బమ్మిడి ధుర్యోధన, బమ్మిడి సంతోష్, శిష్టు గోపి ఉన్నారు.



కార్తీక సందడి..

గౌరీపౌర్ణమి తర్వాత ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్నటువంటి ఒడియా సంప్రదాయం పాటించే వారికి కార్తీకం ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీంతో గడచిన సోమవారం నుంచి శివాలయాల్లో సందడి మొదలైంది. ఈ వారం కూడా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఒడియా సంప్రదాయం ప్రకారం కార్తీకం పూజలు చేస్తున్నారు. వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కంచిలిలోని పాతాళేశ్వర ఆలయంలోని స్వామిని భక్తులు అధికంగా దర్శించుకున్నారు.

– కంచిలి

మైదానాన్ని తలపిస్తూ..

ఇచ్ఛాపురం మండలంలోని చాలా చెరువులు అడుగంటాయి. నీరు లేక మైదానాన్ని తలపిస్తున్నాయి. వర్షాలు లేని కారణంగా వరిపైరుకు మోటార్ల ద్వారా సాగునీరు అందించడానికి రైతులు ప్రయత్నాలు చేసిన ప్రయోజనం లేదు. కొఠారీ, కొళిగాం, హరిపురం గ్రామాల్లోని చెరువులు రెల్లిగడ్డి, గుర్రపు డెక్కలతో అల్లుకుపోయాయి.

–ఇచ్ఛాపురం రూరల్






వైద్యం కోసం..

పొల్లాడ గ్రామానికి చెందిన గౌడు సుశీల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. నిరుపేద కావడంతో వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. శస్త్రచికిత్సకు సుమారు రూ. తొమ్మిది లక్షలు ఖర్చువుతోందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అండగా నిలిచింది. రూ. పది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. సేవా సమతి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు, మండల మహేష్, బి.విజయ్, రవి, పవన్‌కుమార్, బి.నవీన్, కె.మోహిని ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు

ప్రమిదల విక్రయాలు..



దీపావళి సమీపిస్తుండడంతో ప్రమిదల తయారీలో కుమ్మర్లు బిజీగా ఉన్నారు. విక్రయాలు కూడా జరుగుతున్నాయి. ఈ నెల 31న దీపావళి సందర్భంగా కొనుగోలుదారుల అభిరుచులకు అణుగుణంగా ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం, తులసిగాం, అరకబద్ర, కీర్తిపురం, కొళిగాం గ్రామాల్లోని కుమ్మరులు ప్రమిదలను వివిధ ఆకృతుల్లో తయారు చేసి విక్రయిస్తున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

